సాక్షి

అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



విద్యా సంస్థల్లోకి నో ఎంట్రీ !

కూటమి ప్రభుత్వ చర్యలు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. విద్యార్థి సంఘాలను నియంత్రించి. వారి గొంతును అణచి వేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. -IIలో



ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

వైఎస్సార్ కడప జిల్లాలోని ఆర్టీపీపీ వద్ద బ్రిడ్జిపైన గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.530
రెండోరకం	రూ.280	రూ.410

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 150 మెట్రిక్ టన్నులు



జెండా పండుగకు సర్వం సిద్ధం



పోలీస్ పరేడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ తదితరులు

రాయచోటి: జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 8.50 గంటలకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాక, పరేడ్‌ద్వారా ''జనరల్ సెల్యూట్'' ప్రదర్శన
- 8.55 గంటలకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆగమనం, పరేడ్ ద్వారా ''జనరల్ సెల్యూట్'' ప్రదర్శన
- 8.58 గంటలకు ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగమనం
- 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ
- 9.05 గంటలకు ముఖ్య అతిథి పరేడ్ సందర్శన
- 9.15 గంటలకు మంత్రి సందేశం
- 9.45 గంటలకు పోలీసుల కవాతు
- 9.50 గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల సన్మాన కార్యక్రమం
- 9.55 గంటలకు డాగ్‌షో
- 10 గంటలకు వివిధ ప్రభుత్వ శకటాల ప్రదర్శన
- 10.30 గంటలకు అగ్నిమాపక శాఖ ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు, అగ్నిమాపక శాఖ ప్రదర్శన
- 11 గంటలకు సాంస్కృతిక కార్యక్రమం, ఎన్‌సీసీ, స్కౌట్స్‌లో పాల్గొనే వారి ఫొటో షూట్
- 11.10 గంటలకు ఉద్యోగులకు ఉత్తమ సేవా సర్టిఫికెట్ల ప్రదానం
- 11.55 గంటలకు ముఖ్య అతిథి వివిధ శాఖల స్టాళ్లు సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ
- 12.05 గంటలకు జాతీయ గీతంతో కార్యక్రమం ముగింపు



స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో జరుగుతున్న ఏర్పాట్లు

న్యూస్‌రీల్

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సి.రాహుల్ చక్రవర్తిరెడ్డిని రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: 2025-26, 2026-27 అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా పనిచేయడానికి అర్హత, ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్స్ (ఫిజికల్ ఎడ్యుకేషన్/పీఈటీలు) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్‌గా 10 సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోపు రెండు ప్రతులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేర్చాలని డీఈఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడా ప్రతిభా అవార్డుకు..

ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా అవార్డు 2025కు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కె.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులను డీఈఓ కార్యాలయంల సమర్పించాలని చేర్చాలని కోరారు.

ఘనీఖాన్‌కు విశిష్ట సేవా పతకం



మదనపల్లె: మదనపల్లె స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ ఉస్మాన్ ఘనీ ఖాన్ నాయబ్ ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధినిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించే పోలీసు అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఈ పతకానికి ఘనీ ఖాన్ ఎంపిక కావడంతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గురువారం ఆయనను అభినందించారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇచ్చే ఈ పతకం అన్నమయ్య జిల్లాకు లభించడం గర్వకారణమని కొనియాడారు. 1987లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరిన ఘనీ ఖాన్ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని మదనపల్లె ఒకటవ, రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్లు, ములకలచెరువు, బి.కొత్తకోట, యర్రావారిపాళెం, గుడిపాల, సీఐ విభాగంతోపాటు వివిధ చోట్ల పని చేశారు. ఆయన విధి నిర్వహణలో ఇప్పటిదాక 70 నగదు రివార్డులు, 50 జీఎస్ఈలను ఉన్నతాధికారుల నుంచి అందుకున్నారు.

పెన్నాకు భారీగా నీరు

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి భారీగా నీటిని విడుదల చేశారు. పెన్నానదిలోనికి మైలవరం జలాశయం నుంచి పదివేల క్యూసెక్కుల నీటిని అధికారులు సోమశిల ప్రాజెక్టుకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వార 13వేల క్యూసెక్కుల నీరు గండికోట జలాశయంలోనికి వస్తుంది. ప్రస్తుతం గండికోట జలాశయంలో 16టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. అదేవిధంగా మైలవరం జలాశయంలో 5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పై నుంచి వస్తున్న నీటిని అధికారులు నేరుగా పెన్నాలోకి విడుదల చేస్తున్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కలికిరి: డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ఇన్ హార్టికల్చర్, డిప్లొమా ఇన్ హార్టికల్చర్-ల్యాండ్ స్కేపింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20న వెంకట్రామన్న గూడెంలో యూనివర్సిటీ పరిపాలన కేంద్రంలో స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయి. ఈ విషయాన్ని కలికిరి హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మీ తెలిపారు. బాలురకు కలికిరి, నూజివీడు, బాలికలకు రామచంద్రాపురం, మడకశిర కళాశాలలు ఉన్నాయని తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20న వెంకట్రామన్న గూడెంలోని యూనివర్సిటీకి విద్యార్హత, టీసీ, కుల, ఆధాయ ధృవీకరణ, ఆధార్ కార్డులు, ఫొటోలతో హాజరవ్వాలని ఆమె కోరారు.

కుట్ర కని 'పింఛన్'



ఇతని పేరు డి.నంజారెడ్డి. పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లి. వయసు 85 సంవత్సరాలు. 2018లో పక్షపాతం రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. పింఛన్ మంజూరు కోసం గతంలో మదనపల్లిలో జరిగిన సదరన్ క్యాంపునకు వెళ్లారు. డాక్టర్ రోగి వద్దకు వచ్చి ఎలాంటి వైద్య పరీక్ష చేయకుండా 75 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరించారు. అయినా రూ. 6వేలు మాత్రమే పింఛన్ అందుకుంటున్నారు. సదరు వ్యక్తి కనీసం నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. తన అర్ధాంగి రమాదేవి సపర్యలు చేస్తోంది.రూ.15 వేల పింఛన్ కోసం తాము తిరగని ఆఫీసు లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఓటు బ్యాంకు కోసం ఆచరణకు సాధ్యం కానీ హామీలను గుప్పించడం అధికారంలోకి వచ్చాక కుట్రలు, సవా లక్ష కొర్రీలతో అర్హులను ఏమార్చి నిలువునా ముంచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గత సార్వత్రిక ఎన్నికల్లో వందశాతం అంగవైకల్యం ఉండి మంచానికే పరిమితమైన దివ్యాంగులకు 15 వేలు పింఛను ఇస్తామని అనేక బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయ్యి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా మంచానికే పరిమితమైన వారు రూ.15 వేల పింఛను కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మంచానికే పరిమితమైన వారిని మోసం చేసేందుకు బాబుకు మనసు ఎలా వచ్చిందని పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇతని పేరు డి.నారాయణరెడ్డి. పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లి. వయస్సు 75 సంవత్సరాలు. గతంలో వృద్ధాప్య పింఛన్ వచ్చేది. రెండేళ్ళ నుంచి గుండె, కిడ్నీ సమస్యల కారణంగా కాళ్ళు చచ్చుబడిపోవడంతో మంచానికే పరిమితం అయ్యారు. పింఛన్ సొమ్ము రెట్టింపు దేవుడెరుగు వచ్చే పింఛన్ కూడా నిలిచిపోయిందని వాపోతున్నారు.

- మంచానికే పరిమితం.. అయినా అందని పింఛన్
- రీవెరిఫికేషన్‌లో వైకల్య శాతం పెంచుతూ నోటీసుల జారీ
- లబోదిబోమంటున్న అర్హులైన దివ్యాంగులు

పెద్దతిప్పసముద్రం: పింఛన్ల ఏరివేతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీవెరిఫికేషన్‌లో అర్హులైన చాలా మంది అనర్హుల జాబితాలో చేరిపోయారు. మరికొందరు మంచానికే పరిమితమై వంద శాతం వికలత్వం ఉన్నా రూ.6 వేలు మాత్రం ఇస్తున్నారు. కాళ్లు, చేతులు బాగునోళ్లకు పింఛన్లు ఇస్తారు, అర్హులకు ఇవ్వారా అని పింఛన్‌దారుల కుటుంబీకులు ప్రశ్నిస్తున్నారు.

574 మందికి నోటీసులు

అర్హులైన పింఛన్‌దారుల నోట్లో మట్టి కొట్టేందుకు ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తూ వికలత్వ శాతాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మంచానికే పరిమితమై వంద శాతం వికలత్వం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు కూడా రీవెరిఫికేషన్ పేరిట రూ.15 వేల పింఛన్ రద్దు చేస్తూ రూ.6 వేల పింఛను కొనసాగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. దీంతో పింఛన్ సొమ్ము ద్వారానే జీవనం సాగించే ఎంతో మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు మండలంలో వివిధ కారణాలతో ఇప్పటి వరకు 574 మంది పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జెడ్పీటీసీ ఎన్నికలు జరగలేదు




ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్ట, పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదని ఒంటిమిట్ట జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీ జరిగిన ఎన్నికలు తీరు బాగాలేదన్నారు.కానీ ఈరోజు ఫలితాలు వెలువడ్డాయి. పులివెందులలో వైఎస్ఆర్‌సీపీకి 683, ఒంటిమిట్టలో 6513 ఓట్లు వచ్చాయన్నారు. ఒంటిమిట్టలో 11 గంల వరకు 8వేల ఓట్లు పోలయ్యాయన్నారు. తర్వాత పోలీసు ప్రొటెక్షన్‌తో మంత్రి వచ్చి 10వేల పై చిలుకు రిగ్గింగ్ చేసుకున్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగింటే గెలుపు మాదేనని, టీడీపీవారు ఓటమి చెందేవారన్నారు. మీకు ఓపెన్ చాలెంజ్ చేస్తున్నా, సిటింగ్ జడ్జి చేత ప్రతి గ్రామానికి పోదాం.. ప్రతి ఓటరును పిలుస్తాం.. వారు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేసి ఉంటే వేలిమీద సిరాచుక్క ఉండాలన్నారు. ఒంటిమిట్ట, పులివెందులలో చేతిమీద సిరా చుక్క లేకుంటే మీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఓట్లు వేసుకున్నట్లే కదా అని అన్నారు. ఈ చాలెంజ్‌కు మంత్రులు, నాయకులు గాని, సంబరాలు చేసుకునేవారు ఎవరైనా సరే ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. మా ఏజెట్లను, ఓటర్లను కొట్టి ఓట్లను రిగ్గింగ్ చేసుకున్నారన్నారని ఆయన తెలిపారు. .

● ఆంధ్రా ఊటీ..మంచుదుప్పటి

మంచుకురిసే వేళ..ద్విగుణీకృతమైన అందాలతో బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఆకట్టుకుంది.గురువారం ఉదయం కొండపై నెలకొన్న వాతావరణ పరిస్థితులు పర్యాటకులను ఆహ్లాదపరిచింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు మంచు, వర్షపు జల్లుల్లో సంచరిస్తూ సందడి చేశారు. ముసురుపట్టి కురుస్తున్న వర్షాలతో హార్సిలీహిల్స్‌పై చల్లటిగాలులు, కొండను కమ్మేస్తున్న దట్టమైన మేఘాల్లో సంచరించేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. -బి.కొత్తకోట



లైట్ల వెలుగులో వస్తున్న కార్లు



కమ్మేసిన దట్టమైన మంచు

కలలు..కల్లలు

తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటుచేయాలని దశాబ్దాల కాలం నుంచి చేస్తున్న ప్రతిపాదనను రైల్వేబోర్డు తిరస్కరించింది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు తమ వంతుగా కృషిచేశారు. కూటమి ఎంపీలు పట్టించుకోలేదు. దీంతో ఉభయ వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రయాణికుల ఆశలు అడియాశలయ్యాయి.





డివిజన్ ప్రతిపాదనకు కేంద్రమైన తిరుపతి రైల్వేకేంద్రం

- బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు సాధ్యం కాదని తేల్చిచెప్పిన రైల్వేబోర్డు
- నోరుమెదపని కూటమి పార్టీల ఎంపీలు
- ప్రయాణికుల ఆశలు అడియాసలు..

రాజంపేట: తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు ఇక లేనట్టే..ఇది సాధ్యం కాదని రైల్వేబోర్డు తేల్చి చెప్పింది.సౌత్‌కోస్ట్ జోన్ ఏర్పాటుకు హద్దులు తీసుకొచ్చిన రైల్వేబోర్డు తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. ఈ డివిజన్ ఏర్పాటైతే ఉభయ వైఎస్సార్ జిల్లాలోని రైలుమార్గాలు, రైల్వేలు అభివృద్ధి చెందుతాయని ఇక్కడి వారు ఆశించారు. అయితే రైల్వేబోర్డు వారి ఆశలపై నీళ్లు చల్లింది.కూటమి పార్టీల ఎంపీలు నోరుమెదపకపోవడంపై సీమ వాసుల్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రైల్వేబోర్డు చైర్మన్ నిర్ణయంపై ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోంది.

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఉన్నా ..

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా జిల్లా వాసి సీఎం రమేష్ ఉండి కూడా తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు విషయంలో ఏమీ చేయలేకపోయారనే విమర్శలున్నాయి. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలను కలుపుతూ ఏర్పాటయ్యే బాలాజీ డివిజన్ విషయంలో సీఎం రమేష్ విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

గుంతకల్ వెళ్లాలంటే దూరాభారం....

తరుచూ సమావేశాలకు గుంతకల్ డివిజన్ కేంద్రానికి వెళ్లి రావాలంటే అధికారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్, గుంటూరు, విజయవాడ నాలుగు డివిజన్లతోపాటు కొత్తగా బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి విశాఖజోన్‌లో కలిపితే బాగుంటుందని రైల్వే నిపుణులు అంటున్నారు. ఆ దిశగా ఎంపీలు రైల్వేమంత్రిత్వశాఖపై ఒత్తిడి తీసుకురావాలని సీమవాసులు కోరుతున్నారు.

- బాలాజీ డివిజన్ ఏర్పాటైతే తిరుపతి-గూడూరు (92.96కిమీ), తిరుపతి-కాట్పాడి (104.39కిమీ), పాకాల-మదనపల్లె (83కిమీ), రేణిగుంట-కడప (125కిమీ)లైన్ కలిపే అంశాన్ని గతంలోనే రైల్వే అధికారులు పరిశీలించారు. కాగా జిల్లా మీదుగా వెలిగొండ అడవుల్లో నుంచి వెళ్లే కృష్ణపట్నం రైల్వే లైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి వెళ్లింది.

» గళంవిప్పిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు




రైల్వేబోర్డు చైర్మన్ నుంచి తిరుపతి ఎంపీ గురుమూర్తికి చేరిన లేఖ సారాంశం కాపీ

బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశంపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు పలుమార్లు గళం విప్పారు.రాజంపేట, కడప ఎంపీలు పీవీ మిథున్ రెడ్డి,మేడారఘునాథరెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలు రైల్వేశాఖను కోరుతూ వస్తున్నారు. రాజ్యసభలో బాలాజీ డివిజన్ మేడా రఘునాథరెడ్డి ప్రస్తావించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా ప్రస్తావించిన సంగతి తెలిసిందే. సీమకు చెందిన కూటమి ఎంపీలు మాత్రం బాలాజీ డివిజన్ పట్ల శ్రద్ధ చూపడంలేదని సీమవాసులు పెదవి విరిస్తున్నారు.

అయితే కొత్త డివిజన్‌కు రైల్వేబోర్డు రెడ్‌సిగ్నల్ వేసింది. తిరుపతి ఎంపీ గురుమూర్తికి రైల్వేబోర్డు పంపిన లేఖలో ఈవిషయాన్ని స్పష్టంగా తెలియచేసింది.

రైల్వేబోర్డు పునరాలోచించాలి



రాజ్యసభలో తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు ప్రాధాన్యత గురించి తెలియచేశాను. అలాగే తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు కూడా ఈ విషయం గురించి రైల్వే మంత్రిత్వశాఖకు తెలియచేస్తూ వచ్చారు. బాలాజీ డివిజన్ ఏర్పాటు వల్ల వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోతోపాటు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లా ప్రాంతాలకు రైల్వేపరంగా న్యాయం జరుగుతుంది. ఆ దిశగా రైల్వేబోర్డు చైర్మన్ పునరాలోచించాలి. -మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

బాలాజీ డివిజన్ ఆవశ్యకతను గుర్తించాలి



ప్రజల అవసరాల దష్ట్యా బాలాజీ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను రైల్వేబోర్డు గుర్తించాల్సిన అవసరం ఉంది. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు బాలాజీ డివిజన్ కీలకం అవుతుంది. రైల్వేబోర్డు సాధ్యంకాదనడం అవివేకమే. రైల్వే యంత్రాంగ పరంగా చూస్తే గుంతకల్ డివిజన్ అనుకూలంకాదని రైల్వేవర్గాలే చెప్తున్నాయి.ఎంపీలు ఈ విషయంలో ఐక్యంగా పోరాడాలి. -భూమనశివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, నందలూరు

భూగర్భజలాల పెంపుపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి: జిల్లాలో భూగర్భజలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం అమరావతి నుంచి భూగర్భజలాల పరిణామాల స్థాయిపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, నీటి వినియోగదారుల సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, జల వనరుల సిబ్బందితో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణయ్య, సాగునీటి వినియోగదారుల సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో భూగర్భజల పరిణామాలు 20 శాతం కన్నా తక్కువగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిమాణస్థాయి పెంపుదలకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి కలెక్టర్ నివేదించారు. రాజంపేట డివిజన్‌లో అధిక వర్షపాతం నమోదు కావడం, అలాగే తిరుమలలో కురిసిన వర్షం ఈ ప్రాంతాలకు చేరుకోవడం వల్ల భూగర్భజలాల పరిణామాల స్థాయి బాగుందన్నారు. మదనపల్లె డివిజన్‌లో యావరేజ్ స్థాయిలో, రాయచోటి డివిజన్‌లో తక్కువగా ఉందన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ ఖజానాకు రూ.20 లక్షల గండి

మదనపల్లె : మదనపల్లె మున్సిపల్ ఖజానాకు వెళ్లాల్సిన లీజు సొమ్ముకు అధికారులు గండి కొడుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ ఆరోపించారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక దినసరి, వారపు సంత గేటు వసూళ్ల లీజును హెచ్చు పాటదారునికి అప్పగించడంలో అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శించారని ప్రశ్నించారు. కౌన్సిల్ దీనికి ఎందుకు ఆమోదం తెలపలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. లీజు అప్పగించడంలో జరిగిన జాప్యం ఫలితంగా రోజుకు రూ.48వేల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోయిందన్నారు. రూ.20 లక్షల దాకా జరిగిన నష్టం జరిగితే కమిషనర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

కర్ణాటక సరిహద్దులో కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన యువకులు

మదనపల్లె రూరల్ : కర్ణాటక సరిహద్దు ప్రాంతం రాయల్పాడు సమీపంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో చీకలబైలుకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. చీకలబైలుకు చెందిన గంగరాజు(27), శశి(24) ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు. జీవనోపాధిలో భాగంగా కర్ణాటకలో పనికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, రాయల్పాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను ఆటోలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాయల్పాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన స్రవంతి

బి.కొత్తకోట : ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. మదనపల్లె జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లికి చెందిన ఎం.నాగరాజు కుమార్తె స్రవంతి (16) ఇంటర్ చదువుతోంది. తల్లి దండ్రులు పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చారు. విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకోగా గుర్తించిన కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా మృతి చెందిందని డాక్టర్లు తెలిపారు.

ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఫ్లైయాష్ టిప్పర్
- ఇద్దరు మహిళలు దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి
- కన్నీరు మున్నీరుగా విలపించిన బంధువులు



మృతి చెందిన గాయత్రి, సుభాషిణి



గాయపడిన వెంకటేష్



ప్రమాదానికి కారణమైన ఫ్లైయాష్ టిప్పర్

జమ్మలమడుగు : మండల పరిధిలోని కలమల్ల గ్రామ సమీపంలో ఆర్టీపీపీ వద్ద బ్రిడ్జిపైన గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వచ్చిన ఫ్లైయాష్ టిప్పర్ ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాషిణి(35), గాయత్రి(25) అనే ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెంకటేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని కలమల్ల ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముద్దనూరు మండల పరిధిలోని కోసినేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణయ్య ఆర్టీపీపీలోని లోకోషెడ్‌లో పని చేస్తుండగా, వెంకటేశు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ అన్నదమ్ములు. గురువారం వారి బంధువులకు సంబంధించిన వివాహానికి ప్రొద్దుటూరుకు బైక్‌లో బయలుదేరారు. బైక్‌ను వెంకటేష్ నడుపుతుండగా అతని భార్య గాయత్రి, వెంకటరమణయ్య భార్య సుభాషిణి వెనుక కూర్చున్నారు. వీరు ఆర్టీపీపీ నుంచి కలమల్ల మీదుగా బైక్‌లో బ్రిడ్జిపై వెళుతుండగా అధిక లోడుతో వస్తున్న ఫ్లైయాష్ టిప్పర్ వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వెంకటేష్, గాయత్రి, సుభాషిణి కిందపడ్డారు. టిప్పర్ వేగంగా గాయత్రి, సుభాషిణిలపై దూసుకెళ్లింది. దీంతో వారిద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎంతసేపటికి 108 వాహనం రాకపోవడంతో సంఘటన స్థలానికి వచ్చిన కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తన జీపులో తీవ్ర గాయాలైన వెంకటేష్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయత్రికి ఇద్దరు, సుభాషిణికి ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పరిశీలించారు.

న్యాయం చేయాలంటూ ధర్నా..

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ స్థానికులు, కార్మికులు బ్రిడ్జిపైనే మృతదేహాలను పెట్టుకుని ధర్నా చేపట్టారు. ఫ్లైయాష్ అధికంగా లోడు చేసుకుంటూ టిప్పర్లు, లారీలు మనుషులను తొక్కించుకుంటూ పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిప్పర్ల యజమానులేమో బూడిదలో ఆదాయం పొందుతుండగా జనం మాత్రం ఇలా మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



సంఘటన స్థలంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి



న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

విద్యా సంస్థల్లోకి నో ఎంట్రీ!

- విద్యార్థి సంఘాలపై నిషేధం
- కూటమి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు



ప్రభుత్వ పాఠశాలల్లోకి అనుమతి నిరాకరణ జీఓపై విద్యార్థి సంఘాల నిరసన (ఫైల్)

మదనపల్లె సిటీ : కూటమి ప్రభుత్వ చర్యలు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా ఉన్నాయి. విద్యార్థి సంఘాలను నియంత్రించి, వారి గొంతును అణచి వేయడమే లక్ష్యంగా పెట్టుకుంది కూటమి సర్కారు. రాజ్యాంగం కల్పించిన విద్యార్థుల హక్కుకు సంకెళ్లు వేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తోందని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,711, ప్రాథమికోన్నత 162, ఉన్నత పాఠశాలలు 304 ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 24, ప్రైవేటు 58, ఎయిడెడ్ 1, ఆదర్శ 17, సాంఘిక సంక్షేమ 10, బీసీ గురుకులాలు 1, కేజీబీవీ 22, వృత్తి విద్యా కాలేజీలు 10 ఉన్నాయి. గత నెలలో విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో వసతి లేమిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రభుత్వం విద్యార్థి సంఘాలపై కక్ష పెంచుకుని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలకు అనుమతి ఇవ్వద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

కాలేజీల్లోకి రాకూడదంటూ మరో జీఓ..

విద్యను వ్యాపారంగా మార్చడం, వసతి గృహాల్లో నాసిరకమైన వసతులు, పలు సమస్యలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు, అధిక ఫీజు వసూలు, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడంపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. దీంతో ప్రభుత్వం మరోసారి జూనియర్ కాలేజీల్లోకి సైతం విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ మరో జీఓను జారీ చేసింది. విద్యార్థి సంఘాలు విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తాయి. నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహనకు, హక్కులు, బాధ్యతలను నేర్పిస్తాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వ చర్యల వెనుక విద్యార్థి సంఘాలను అణచివేయడం ద్వారా ప్రశ్నించే, పోరాడే శక్తులను నిలువరించాలని, విద్యార్థుల్లో సామాజిక చైతన్యం లేకుండా చేయాలనే ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధమైనవని, నిరంకుశత్వ ధోరణికి నిదర్శనమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఆంక్షలు ఎత్తి వేయాలి..



విద్యారంగంలో సమస్యలపై ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటి హక్కులను కాలరాసేందుకు కూటమి ప్రభుత్వం కుటిల యత్నాలు చేయడం దుర్మార్గం. విద్యను వ్యాపారం చేస్తున్న కాలేజీలపై గళం విప్పితే ఆంక్షలు విధించడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. తక్షణం విద్యార్థి సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి.

– నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు.

అనాలోచిత నిర్ణయం..



ప్రభుత్వ అనాలోచిత విధానాలతో ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఫీజులు, పుస్తకాల పేరుతో ఇప్పటికే రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్నాయి. వీటిని అడ్డుకునేవారు లేకుండా చేయడం కోసం అడ్డగోలు జీఓలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలపై స్పందించే వారు లేకపోతే అధికారులు, ప్రభుత్వం ఎలా చేసినా అడిగేవారు లేకుండా పోతారు.

– మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

భలే కేటుగాళ్లు..!

- సెల్ ఫోన్లు చోరీ చేసి బ్యాంకు ఖాతాల్లో నగదు హాంఫట్
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 46 సెల్‌ఫోన్లు, రూ.2.8లక్షలు స్వాధీనం
- నిందితులు హైదరాబాద్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు వాసులు

తిరుపతి క్రైమ్ : సెల్ ఫోన్లు చోరీ చేసి ఆ సెల్ ఫోన్ ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలోని నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈస్ట్ పోలీస్ స్టేషన్ విలేకరులకు తెలిపిన వివరాలు..హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, అన్నమయ్య జిల్లాకు చెందిన అశోక్, నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డం కసిరెడ్డి ఓ ముఠాగా ఏర్పడి నగరంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడేవారు. అలా చోరీ చేసిన మొబైల్ ఫోన్లలో ఆ వ్యక్తుల ఫోన్ పే, గూగుల్ పేను పరిశీలించి అందులో నగదును సరికొత్త ఎత్తుగడలతో కొట్టేసేశారు. ఏటీఎం సెంటర్ వద్ద కాపు కాసి, అక్కడకు వచ్చే వారికి తమ వారు హాస్పిటల్లో ఉన్నారని, డబ్బులు చాలా అవసరమని ఫోన్ పే చేస్తామని, కావాలంటే కమీషన్ కూడా ఇస్తామని వారిని నమ్మిస్తారు. ఇలా కహానీలు చెప్పి వీరంతా 49 సెల్ ఫోన్లు దొంగతనం చేసి 3.6 లక్షలు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హరికృష్ణ నుంచి రూ.లక్ష, 40 సెల్ ఫోన్లు, అశోక్ నుంచి రూ.90 వేలు, 6 సెల్ ఫోన్లు, కసిరెడ్డి నుంచి రూ.90 వేలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కృషి చేశారని డీఎస్పీ వారిని అభినందించారు.



నిందితులను అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదును చూపుతున్న డీఎస్పీ

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు ప్రవీణ్‌కుమార్

మదనపల్లె రూరల్ : బైక్‌పై వెళుతున్న యువకుడిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం పుంగనూరు నియోజకవర్గం బండ్లపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెలో జరిగింది. పెద్దనల్లూరిపల్లెకు చెందిన అగస్త్యప్ప కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) వ్యక్తిగత పనుల నిమిత్తం పుంగనూరుకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని నల్లగుట్టపల్లె వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో పాటు కాలు విరిగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాల్సిందిగా వైద్యులు రెఫర్ చేశారు. అయితే బాధిత కుటుంబం తిరుపతికి వెళ్లలేమని, ఇక్కడే స్థానికంగా వైద్యం అందించాల్సిందిగా విన్నవించారు. అయితే ఆస్పత్రి సిబ్బంది, తమ వద్ద తలకు చికిత్స అందించేందుకు వైద్యుడు లేడని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఆస్పత్రిలోనే పెట్టుకుని ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడ్డారు.

బీహార్‌ను మరిపించేలా జెడ్పీటీసీ ఎన్నికలు

- స్థానికులు ఓటు వేయకుండా అడ్డుకున్న పచ్చమూకలు
- కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు
- సీసీ ఫుటేజీలు, వెబ్ కాస్టింగ్ వీడియోలు ఇస్తే నిరూపిస్తాం
- ఎస్ఈసీ, టీడీపీ, పోలీసుల కుమ్మక్కు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు బీహార్‌ను మరిపించేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా ఎన్నికల్లో దౌర్జన్యాలు, అక్రమాలు జరిగితే బీహార్‌తో పోల్చేవారని, ఇకపై ఆంధ్రప్రదేశ్‌తో పోలుస్తారన్నారు. రాష్ట్రంలో పలు ఖాళీలు ఉన్నప్పటికీ ఒక పథకం ప్రకారం ఎంపిక చేసుకున్న కొన్ని స్థానాల్లోనే ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, పోలీసులు కూడబలుక్కుని నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రతిపక్ష నేతలపై దాడులు నిర్వహించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కనంపల్లె సర్పంచ్ రామాంజులు ఇంటి వద్ద తుపాకీ ఉంచి బెదిరించారన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేని వారిని బైండోవర్ చేశారన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ మూకలు ఓటర్ల స్లిప్పులు లాక్కొని పంపి వేశారని ఆరోపించారు. ఏజెంట్లను కూడా కొట్టి బయటికి పంపేశారన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, విజువల్స్ తమ వద్ద ఉన్నాయంటూ ఆయన ప్రదర్శించారు. సిద్దవటంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో ఉండటం, కలెక్టర్ సమక్షంలోనే బయటి వ్యక్తులు దొంగ ఓట్లు వేస్తుండటం, కాల్చి వేస్తామంటూ డీఎస్పీ ఓటర్లను బెదిరించడం తదితర ఫొటోలను ఆయన మీడియా ఎదుట ప్రదర్శించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ఇప్పటికి 39 పిటిషన్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఇంత జరిగినా కలెక్టర్, ఎస్పీ, డీఐజీలు ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నేతలు విజయోత్సవాలు నిర్వహించుకోవడం విచారకరమన్నారు.

కుక్క అడ్డురావడంతో
అదుపుతప్పి ఆటో బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మి, భార్గవి

మదనపల్లె రూరల్ : వివాహానికి వెళుతుండగా, మార్గమధ్యంలో కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన నాగలక్ష్మి(45), భార్గవి(25), అంజనమ్మ(45), కల్యాణి(30) నలుగురు కలిసి అదే ప్రాంతానికి చెందిన శ్రీరామకృష్ణ ఆటోలో తంబళ్లపల్లె మండలం ఎర్రగుట్టపల్లెలో పెళ్లికి బయలుదేరారు. మార్గమధ్యంలో తంబళ్లపల్లె మండలం తిమ్మయ్యగారిపల్లె వద్ద ఆటోకు అడ్డుగా కుక్క రావడంతో, డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నాగలక్ష్మి, భార్గవిలు తీవ్రంగా గాయపడ్డారు. అంజనమ్మ, కల్యాణికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మి, భార్గవి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆరుతడి పంటల రైతుల్లో అలజడి

- జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
- ఉరకలెత్తుతున్న కుందూ, పెన్నా నదులు



చాపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కడప అగ్రికల్చర్ : జిల్లాలో గత వారం రోజులకుపైగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో అలజడి నెలకొంది. అల్పపీడనం కారణంగా ఎక్కడపడితే అక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆరుతడి పంటల రైతుల్లో ఆందోళన మొదలైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముందుగా సాగు చేసిన ఆరుతడి పంటలకు కొన్నింటికి మేలు జరిగినా మరి కొన్ని చోట్ల మాత్రం ఇబ్బందికరమే. దీంతోపాటు ఆలస్యంగా సాగు చేసిన ఆరుతడి పంటల రైతులకు మాత్రం గుండెల్లో గుబులు పట్టుకుంది. ముఖ్యంగా ఉల్లి, మినుము, జొన్న ఇలాంటి పంటలు సాగు చేసిన రైతులకు మాత్రం ఆందోళన తప్పడం లేదు. కొన్ని చోట్ల ఉల్లి పంట రెండు నెలల దశలో కూడా ఉంది. ఇప్పుడిప్పుడే గడ్డలు ఏర్పడే దశ కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షానికి పొలాల్లో వర్షపు నీరు నిలిస్తే ఎర్రగడ్డలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వేలకు వేలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంట మరో నెల రోజుల్లో చేతికొచ్చే సమయంలో ఇలాంటి ఎడతెరిపి లేని వర్షాలతో పంటనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ వర్షాలు ఇలాగే మరో నాలుగు రోజులు కొనసాగితే మాత్రం ఎర్రగడ్డ రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం అధికంగా ఉంది. దీంతోపాటు ఉద్యాన పంటలైన పూల రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పూలు నాణ్యత తగ్గుతున్నాయని రైతన్నలు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలకు తెగుళ్ల బెడద పెరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా పెన్నా, కుందూ నదులు..

వరుసగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పెన్నా, కుందూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాపాడు మండలం అల్లాడుపల్లె దేవళాల వద్ద కుందూనది, చెన్నూరు, సిద్దవటం వద్ద పెన్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

పులివెందులలో అత్యధికంగా...

గురువారం తెల్లవారుజాము నుంచి పులివెందులలో అత్యధికంగా 9.6 ఎంఎం వర్షం కురిసింది. అలాగే వేములలో 9 ఎంఎం, ఖాజీపేటలో 6.8 ఎంఎం, సీకేదిన్నెలో 6.4 ఎంఎం, చక్రాయపేటలో 5.8 ఎంఎం, సింహాద్రిపురంలో 5.6 ఎంఎం, కడప, చెన్నూరులలో 5.2, తొండూరు, పెండ్లిమర్రిలో 4.6, రాజుపాలెం, దువ్వూరు, వల్లూరులలో 4.2, వేముల, మైదుకూరు, జమ్ములమడుగు, వేంపల్లిలో 4, కొండాపురంలో 3.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసంది. సిద్దవటంలో 3 మిల్లీమీటర్లు, ప్రొద్దుటూరులో 2.6, బద్వేల్‌లో 2.4, చాపాడు, బి.మఠంలలో 2.2, కలసపాడులో 1.8, గోపవరం, అట్లూరు, ముద్దనూరులలో 1.2 మి.మీ. వర్షం కురిసింది.

జిల్లాలో సాగులో ఉన్న ఆరుతడి పంటల వివరాలు...

పంట	సాగు (హెక్టార్లలో)
మొక్కజొన్న	1772
సజ్జ	710
జొన్న	48
కంది	285
మినుము	1502
వేరుశనగ	983.38
పొద్దుతిరుగుడు	225
ఆముదం	23.2
పత్తి	3524.27